ఐదేళ్ల మద్యం దందాపై ఆరా

- ఎస్పీవై రెడ్డి ఆగ్రో పరిశ్రమలో విస్తృత సోదాలు
- సీఐడీ పర్యవేక్షణలో 30 మంది అధికారుల తనిఖీలు
- పలు దస్త్రాలు స్వాధీనం

ఈనాడు, నంద్యాల, న్యూస్‌టుడే, నంద్యాల నేరవిభాగం : రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున నకిలీ మద్యం తయారుచేసి విక్రయించారన్న ఆరోపణల నిగ్గు తేల్చేందుకు సీఐడీ అధికారులు మంగళవారం విస్తృత సోదాలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు మద్యం తయారీ యూనిట్లలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నంద్యాల ఉడుమాల్పురం పారిశ్రామికవాడలోని ఎస్పీవై రెడ్డి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు కొనసాగించారు. సీఐడీ, ఎక్సైజ్, పోలీసు విభాగాల నుంచి వచ్చిన నిపుణులైన అధికారులు, ఉద్యోగులు సుమారు 30 మంది సోదాలు నిర్వహించారు. సీఐడీ అదనపు ఎస్పీ హుసేన్‌పీరా పర్యవేక్షణలో ఉదయం 9.30 గంటల నుంచి తనిఖీలు చేపట్టారు. గత ఐదేళ్ల కాలంలో ఆ సంస్థ నిర్వహించిన అన్ని లావాదేవీలకు సంబంధించిన రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. మద్యం తయారీ యూనిట్ల చట్టం ప్రకారం రికార్డులు నిర్వహించారా లేదా? వాటిలో వివరాలు సరిగా నమోదు చేశారా? లేదా? అని క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల్లోని వివరాలన్నీ యథాతథంగా ఉన్నాయా? ఏమైనా ట్యాంపరింగ్ జరిగిందా? అన్న విషయాన్ని నిర్ధారించుకునేందుకు అధికారులకు ఎక్కువ సమయం పట్టింది. అన్ని రికార్డులు ఉన్నాయా? ఏమైనా మాయం చేశారా అన్న కోణంలోనూ విచారణ చేపట్టారు. మద్యం తయారీకి అవసరమైన ముడి సరకును ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు? ఎంత పరిణామంలో కొనుగోలు చేశారు? ఏ నాణ్యతతో కూడిన ముడిసరకు వినియోగించారు? ఎంత పరిమాణంలో మద్యం ఉత్పత్తి చేశారు? ఏయే బ్రాండ్లను తయారు చేశారు? ప్రభుత్వానికి ఎప్పుడెప్పుడు ఎంతెంత మద్యం సరఫరా చేశారు తదితర వివరాలకు సంబంధించిన వివరాలు పరిశీలించారు. కంప్యూటర్లలో ఉన్న డేటాను కూడా తనిఖీ చేశారు. సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించేందుకు వీలుగా గత ఐదేళ్ల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సంస్థను ప్రస్తుతం ఎవరు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. ఎవరి ఆధ్వర్యంలో సంస్థలో కార్యకలాపాల నిర్వహణ జరుగుతోంది? అధికారిక వ్యక్తుల ఆదేశాల ప్రకారమే పరిశ్రమలో కార్యకలాపాలు సాగుతున్నాయా? లేదా అనధికారిక వ్యక్తుల ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకుంటున్నారా అని విచారించారు. ఆర్థిక లావాదేవీలు నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా లేదా అని పరిశీలించారు. వివిధ సంస్థలకు చేసిన చెల్లింపులు చట్ట ప్రకారం జరిగాయా? డొల్ల కంపెనీలకు ఏమైనా నగదు బదిలీ జరిగిందా అన్న విషయాలను ధ్రువీకరించుకునేందుకు వీలుగా కొన్ని రికార్డులను తనిఖీ చేశారు. సంస్థకు చెందిన కొందరు కీలక ప్రతినిధులు అధికారులను కలిసినప్పటికీ ఏయే రికార్డులు ఎక్కడున్నాయన్న విషయాన్ని మాత్రమే వారిని అడిగారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా చట్ట ప్రకారం పంచనామా చేయడానికి వీలుగా రెవెన్యూ అధికారులను కూడా పిలిపించారు.






జలతరంగం

ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో శ్రీశైలం జలాశయం నుంచి నీటి విడుదలను తగ్గించారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 94,016 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. మంగళవారం జలాశయం రెండు గేట్లను పది అడుగుల మేర పైకెత్తి 55,508 క్యూసెక్కులు చొప్పున నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. - సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే :

సీమ ప్రగతికి ముఖద్వారం

- డ్రోన్ హబ్ ఏర్పాటుకు నిర్ణయం
- 300 ఎకరాల్లో నూతన ప్రాజెక్టు
- స్మార్ట్‌సిటీ అభివృద్ధికి నిర్ణయం

సీమ ముఖద్వారం అభివృద్ధికి చిరునామాగా మారుతోంది. నాడు రాజధాని దూరమైనా.. నేడు రాజకీయ ప్రగతి దరిచేసే ప్రయత్నాలు సాగిస్తోంది కూటమి ప్రభుత్వం. కర్నూలులో మెగా ఇండస్ట్రియల్ హబ్, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ముందడుగు వేస్తోంది. కర్నూలు విసీలకాశంలో డ్రోన్ విహారం చేయనున్నాయి. 300 ఎకరాల్లో కొత్త ప్రాజెక్టు రూపకల్పన చేస్తోంది. అమరావతిలో ఇటీవల జరిగిన డ్రోన్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అదే కార్యక్రమం ప్రకటించారు. ఇటు హైదరాబాద్, అటు బెంగళూరు మహానగరాల జాతీయ రహదారి మధ్యలో కర్నూలు ఉండటం వల్ల అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. డ్రోన్ అవసరాలు విస్తృతంగా మారాయి. రక్షణ వ్యవస్థలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నాయి. తక్కువ ధరతో ఎక్కువ ప్రయోజనాలు కలిగేలా డ్రోన్లు తయారు చేయాలనే లక్ష్యంతో హబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పలువురు సాంకేతిక నిపుణులకు పెద్దఎత్తున ఉపాధికి అవకాశం కలుగుతుందని చెబుతున్నారు.



ఆదర్శ నగరంగా మార్చేందుకు ప్రణాళికలు

కర్నూలును ఆదర్శ నగరం (స్మార్ట్‌సిటీ)గా మారుస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల పుచ్చకాయలమడలో ప్రకటించారు. మంత్రి టి.జి.భరత్‌తో చర్చించారు. నివేదిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించింది. ప్రజలకు ఉపయుక్త ప్రాజెక్టులు నగరంలో చేపట్టేందుకు వీలుగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

హంద్రీ, తుంగభద్ర నదులున్న నేపథ్యంలో వాటికి ఆనుకునే నది వీక్షణ ఉద్యానవనం (రివర్‌వ్యూ పార్క్) అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

ఆహ్లాదం... ఆనందం

బాహ్యవలయ దారి

నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివసించే వారు తమ ప్రాంతాలకు వేగంగా వెళ్లేందుకు వీలుగా సుమారు 50 కి.మీ. దూరం ఒక బాహ్య వలయ రహదారి ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఆ మార్గం కూడా త్వరలోనే ఖరారు చేయనున్నారు. ఓర్వకల్లులో బృహత్తర పారిశ్రామిక సముదాయం (మెగా ఇండస్ట్రియల్ హబ్)లో పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో నగరం నుంచి ఎలాంటి ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా ఉండేలా రహదారి రూపకల్పన దిశగా చర్చలు సాగిస్తున్నారు. హంద్రీ, తుంగభద్ర నదీ తీరాల వెంట నెక్లెస్ రోడ్డుగా అభివృద్ధి చేసి అవుటర్ రింగురోడ్డుకు అనుసంధానం చేస్తారు. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో కూడళ్లను దాటేందుకు వీలుగా మూడు వరకు పైవంతెనలు నిర్మించనున్నారు.

హైకోర్టు బెంచ్‌కి అధునాతన ప్రాంగణం


రాయలసీమ వాసులందరికీ ఉపయుక్తంగా ఉండేలా హైకోర్టు బెంచ్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అధునాతన సదుపాయాలతో హైకోర్టు బెంచ్ భవనాల సముదాయం ఉండేలా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఎక్కడ ఏర్పాటు చేయనున్నారో త్వరలో ఖరారు కానుంది.

భద్రతకు ప్రాధాన్యం

నగరంలోని అన్ని పర్యాటక ప్రాంతాలను, పార్కులను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దనున్నారు. పర్యాటక ప్రాంతాలకు రాకపోకలకు సులభతరం చేసేలా మౌలిక సదుపాయాలు, రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు మహిళల భద్రతకు వీలుగా భద్రతా సిబ్బందిని, పోలీసు నిఘా ఉండేలా చర్యలు తీసుకుంటారు.

స్వచ్ఛత చెంతకు..

నగరవాసులు సౌకర్యవంతంగా, ఆరోగ్యంగా జీవించాలంటే నగరం పరిశుభ్రంగా ఉండాలి. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలకు మంచినీరు అందడంలేదు. పాతబస్తీలో విద్యుత్తు తీగలు అత్యంత సమీపంలో వేలాడుతుండటంతో ప్రమాదకర పరిస్థితుల్లో జీవిస్తున్నారు. కొత్త మంచినీటి పైపులైన్ల వ్యవస్థ, పారిశుద్ధ్య పరిస్థితుల మెరుగుతో పాటు విద్యుత్తు ముప్పు లేకుండా లైన్లను ఏర్పాటు చేయనున్నారు.



ఓర్వకల్లులో ఉపాధి మేడలు



ఓర్వకల్లు పారిశ్రామికవాడకు రూ.2,500 కోట్లను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన నేపథ్యంలో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ఆధ్వర్యంలో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. మొదటిదఫా ఉప్పలపాడు, మీదివేముల, ఎన్.కొంతలపాడు గ్రామాల పరిధిలో 2,600 ఎకరాలు కేటాయించారు. రానున్న రెండేళ్లలో మొదటి దశ పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి. కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో రానున్న ఐదేళ్లలో రూ.10 వేల కోట్లతో పారిశ్రామికవాడలో మౌలిక వసతులు కల్పించేలా లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు. 9,936 ఎకరాలను పరిశ్రమలకు అనువుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారు. రూ.60 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా భారీ పరిశ్రమలను ఆహ్వానించేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో పాలకులు ముందుకెళ్తున్నారు.

వంటింట దీపం

- ఉచిత సిలిండర్లకు శ్రీకారం
- 12.51 లక్షల కనెక్షన్లు

ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన "పేదలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ"ని దీపావళి నుంచి అమలుచేసేలా నిర్ణయించింది. ఏడాదికి మూడు వాయుబండలు ఇచ్చేలా చర్యలు చేపట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 12.51 లక్షల గృహ వినియోగ వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో ఒక్కో సిలిండర్ ధర రూ.858గా ఉంది. ప్రభుత్వ రాయితీ రూ.41 పోనూ రూ.817 చొప్పున ఒక్కో కుటుంబానికి ఏటా రూ.2,451 వరకు ప్రయోజనం కలగనుంది.

ఈ-కేవైసీ వేగవంతం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 75 గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లు సరఫరా చేస్తున్నాయి. కర్నూలులో 6,74,385, నంద్యాలలో 5,77,441 కనెక్షన్లు ఉన్నాయి. ఏజెన్సీల పరిధిలోని వినియోగదారులకు ఈ-కేవైసీ చేయించే ప్రక్రియ చివరి దశకు వచ్చింది. వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్దకు ఆధార్ కార్డు తీసుకెళ్లి వేలిముద్రలు వేయించుకుంటున్నారు. ప్రక్రియ పూర్తి అయితే గ్యాస్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయన్న లెక్క తేలుతుంది.

24 నుంచే నమోదు చేసుకోవచ్చు

ఉచిత సిలిండర్ల పంపిణీని దీపావళి నుంచి ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించిన నేపథ్యంలో 24వ తేదీ నుంచి సిలిండర్ కోసం నమోదు చేసుకోవచ్చు. 31వ తేదీ నుంచి దీపం పథకం కింద వాయుబండలు అందించనున్నారు. సిలిండర్ తీసుకున్నాక రెండు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో గ్యాస్ రాయితీ జమ చేసేలా ప్రణాళికలు చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.



కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే :

విభాగం	కర్నూలు	నంద్యాల
దీపం	2,04,629	1,55,323
ఉజ్వల	46,824	33,732
సీఎస్ఆర్	11,436	21,505
జనరల్	4,11,496	3,66,881

ఎవరికి ఎంత లాభం

1 1999లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు దీపం పథకాన్ని ప్రారంభించారు. దీని కింద ఉమ్మడి జిల్లాలో 3,59,952 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో గ్యాస్ సిలిండర్ ధర రూ.858 ఉండగా రూ.41 రాయితీ పోనూ ఏడాదికి రూ.2,451 చొప్పున 3.59 లక్షల కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వం రూ.88.22 కోట్లు భరించాల్సి ఉంది.

2 సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఇంధన కంపెనీలకు సంబంధించి 32,941 కనెక్షన్లు ఉన్నాయి. వీటికి రూ.8.07 కోట్ల వరకు భరించాల్సి ఉంది.

3 రేషన్ కార్డుల ప్రాతిపదికన 7.44 లక్షల జనరల్ గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. వీరికి ఏడాదికి మూడు సిలిండర్ల చొప్పున రూ.182.49 కోట్లను ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంది.

4 ప్రధాన మంత్రి ఉజ్వల పథకం కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80,556 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌పై రూ.300 చొప్పున ఏటా 12 సిలిండర్లకు రాయితీ ఇస్తోంది. ఒక్కో సిలిండర్‌పై రూ.558 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం మూడు సిలిండర్ల మొత్తాన్ని భరించాల్సి ఉంది. ఏడాదికి మూడు సిలిండర్లకు రూ.1,674 చొప్పున 80,556 కుటుంబాలకు సంబంధించి ప్రభుత్వం రూ.13.48 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది.

ఈ-నామ్ కేవాస్తే

- పంట అమ్మకానికి అవస్థలు
- అర్ధరాత్రి వరకు రైతుల నిరీక్షణ

పంట ఉత్పత్తులు అమ్ముకోవడానికి రైతులు పడిగాపులు కాస్తున్నారు. సర్వర్ సమస్య నెలకొనడంతో 'ఈ-నామ్' విధానాన్ని ఆటంకం తలెత్తింది. అంతర్జాల విధానం సరిగా పని చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన మార్కెట్లు కర్నూలు, ఆదోనిలో రెండు రోజులుగా అర్ధరాత్రి వరకు నిరీక్షిస్తున్నారు. సమస్య ఇప్పటికిప్పుడే పరిష్కారమయ్యే పరిస్థితి కనిపించకపోవడంతో ఆదోని మార్కెట్‌కు సెలవు ప్రకటించగా.. కర్నూలు మార్కెట్లో ఉల్లి పంట కొనుగోలుకే అనుమతి ఇవ్వడం గమనార్హం.

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే:

రకం	దిగుబడులు (క్వింటాళ్లలో)
వేరుశనగ	733
పూల విత్తనాలు	62
ఆముదాలు	802
వాము	50
మొక్కజొన్న	151
కందులు	50
ఉల్లిగడ్డలు	9,736
ఎండుమిర్చి	60
కొర్రలు	125
మినుములు	16
సోయాబీన్స్	14
సజ్జలు	91



మంగళవారం కర్నూలు మార్కెట్‌కు వచ్చిన దిగుబడి

25 వరకు ఇదే పరిస్థితి

ఈ.నామ్ విధానంలో సాంకేతిక సమస్యల నేపథ్యంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో బుధ, గురువారాల్లో ఉల్లి మినహా ఇతర పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరగవు.. ఈనెల 24 వరకు ఉల్లి క్రయవిక్రయాలు మాత్రమే జరుగుతాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ నుంచి అన్నిరకాల పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు చేపడతామన్నారు.

అర్ధరాత్రి వరకు విక్రయాలు

కర్నూలు విపణికి సోమవారం రికార్డు స్థాయిలో 404 మంది రైతులు 13,070 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు తీసుకొచ్చారు. మొత్తం 670 మంది రైతులు అన్నిరకాల పంట ఉత్పత్తులు తెచ్చారు. రాత్రి వరకు చూసి మాన్యువల్‌గా.. పాత పద్ధతిలో ధరలు ఖరారు చేశారు. ఫలితంగా ఉల్లి తూకాలు రాత్రి పది గంటల వరకు జరిగాయి. మంగళవారం 9,736 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. ధరల వివరాల కోసం అన్నదాతలు గంటల తరబడి నిరీక్షించినా ఫలితం లేకపోయింది. చివరికి మంగళవారం సాయంత్రం 4 గంటలకు ధరలు వెల్లడించారు. మొత్తం 631 మంది రైతులు అన్నిరకాల పంట ఉత్పత్తులు తీసుకొచ్చారు. కమీషన్ ఏజెంట్లు చేతిరాతతో రశీదులు ఇస్తున్నారు. ఆదోని మార్కెట్‌కు సోమవారం 12 వేల క్వింటాళ్ల పత్తి, మంగళవారం 10 వేల క్వింటాళ్ల పత్తి తీసుకొచ్చారు. తూకాల ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది.

రైతుల వెలవెల

ఉమ్మడి జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్లలో ఈ-నామ్ విధానం అమల్లో ఉంది. ఇక్కడికి రెండు జిల్లాల రైతులే కాకుండా తెలంగాణ, కర్ణాటక నుంచి పంట ఉత్పత్తులు తీసుకొస్తుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ.నామ్ విధానంలో సర్వర్ సమస్యలు నెలకొనడంతో కొనుగోలు ప్రక్రియకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ధరల ఖరారు. . తూకాలు, బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో మాన్యువల్‌గా.. పాత పద్ధతిలో ధరలు ఖరారు చేయడంతో వ్యాపారులు పెత్తనం చేస్తున్నారు. ధరలు అమాంతం తగ్గిస్తున్నారు.



అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూడాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : జిల్లా సమగ్రాభివృద్ధికి నిధుల కొరత లేకుండా చూడాలని ఎంపీ డా.బైరెడ్డి శబరి కలెక్టర్ జి.రాజకుమారిని కోరారు. నంద్యాల కలెక్టరేట్‌లో మంగళవారం ఎంపీ కలెక్టర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధిహామీ నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయకపోతే నిధులు తగ్గుతాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని హిందూ శ్మశాన వాటికల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు విడుదలయ్యేలా కృషి చేస్తామన్నారు.

24న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం నూనెపల్లె పురపాలక ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 24వ తేదీన ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నందిపైపుల స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బీఫాం, ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా నకలు పత్రం తేవాలని సూచించారు.

అడవిలో అర్ధరాత్రి

- ఆగిపోతున్న వాహనాలు
- గుంతలమయంగా ఘాట్ రోడ్డు




వినుకొండ నుంచి కర్రల లారీతో కర్ణాటక రాష్ట్రం గాందోలికి వెళ్తున్నాం. రోళ్లపెంట వద్ద గుంతలకు వాహనం కట్టర్ బ్లేడ్లు విరిగిపోయాయి. సోమవారం రాత్రి 12 గంటల సమయంలో అడవిలో ప్రయాణం ఆగింది. మంగళవారం ఉదయం డ్రైవర్ ఆత్మకూరుకు వెళ్లి మెకానిక్‌ను తీసుకొచ్చారు. మరమ్మతులు చేసేసరికి రాత్రి అయ్యింది.. భయం.. భయంగా గడపాల్సి వచ్చింది. - సుంకన్న వెలుగోడు!!

★ కర్నూలు నుంచి శ్రీశైలం, ప్రకాశం, అమరావతి వెళ్లే ప్రయాణికులకు నల్లమల ఘాట్ రోడ్డులో వెళ్లే ప్రయాణికులందరి పరిస్థితి ఇలానే ఉంది.. అసలే చిట్టడవి.. ఒకే వరుసలో వెళ్లాలి.. చరవాణి సిగ్నల్స్ ఉండవు.. బిక్కుబిక్కుమంటూ ప్రయాణం.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దారంతా గుంతలమయంగా మారింది.. వాటిని దాటలేక వాహనాలన్నీ మార్గమధ్యంలోనే ఆగిపోతున్నాయి.. ఈ సమాచారం పోలీసులకు సకాలంలో అందక ప్రయాణికులు అర్ధరాత్రి నల్లమల అడవిలో గడపాల్సిన పరిస్థితి నెలకొంది. 'ఈనాడు-ఈటీవీ' బృందం మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా ప్రయాణికులు వెతలు వినిపించారు. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించాలని విన్నవిస్తున్నారు.

– ఆత్మకూరు, న్యూస్‌టుడే:





ఆత్మకూరు నుంచి దోర్నాల మధ్య 58 కి.మీ.లు ఉండగా.. అందులో దాదాపు 40 కి.మీ.ల మేర అటవీ మార్గం ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దారంతా చెదిరింది. తారు కొట్టుకుపోయింది.. వెంకటాపురం- రోళ్లపెంట మధ్య గుంతలు దాటలేని పరిస్థితి నెలకొంది. అక్కడి నుంచి దోర్నాల మండలం కొర్రప్రోలు వరకు 'దారి'ణంగా మారింది.

రోళ్లపెంట సమీపంలో రోడ్డుపై గుంతలు

బైర్లూటి- రామయ్యకుంట మధ్యలో రెండు చోట్ల పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అదేవిధంగా రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన గుంతలతో వాహనాలు కిందికి దిగలేని పరిసితి నెలకొంది. రోళ్లపెంట సమీపంలో కి.మీ మేర గుంతలే ఉన్నాయి. నల్లమడుగులపెంట గేట్ కుదుపు రస్తా వరకు ఇలానే ఉంది.

వెంకటాపురం- సంజీవనగర్‌తండా మధ్య పల్లెకట్ల సమీపంలో పెద్ద గుంత ప్రమాదకరంగా మారింది. తాత్కాలికంగా వేసిన కంకర రాళ్లు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయాయి.

అడవిలో వదిలేసిన జగన్

● పిన్నాపురం నుంచి ప్రకాశం జిల్లా కొత్తూరు వరకు దాదాపు 38.80 కి.మీ. విస్తరించడానికి తెదేపా హయాంలో 2017-18 వరకు సర్వే చేశారు. ఇందులో ఏడు కి.మీ వెడల్పుతో తారు రోడ్డు, 1.5 మీ. చొప్పున ఫుట్‌పాత్ ఉండేలా నిర్మించాలని ప్రతిపాదించారు. అనుమతులు ఇవ్వాలని దిల్లీలోని అటవీ శాఖ ప్రధాన కార్యాలయానికి నివేదిక పంపించారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ సర్కారు పనులను అటకెక్కించింది.. వాహనాల రద్దీ తక్కువగా ఉందంటూ పక్కన పెట్టారు.

విస్తరణ కొంత వరకే

కర్నూలు-గుంటూరు (ఎన్‌హెచ్ 340సి) రహదారిని ప్రస్తుతం గార్గేయపురం నుంచి ఆత్మకూరు మండలం పిన్నాపురం వరకు 73.600 కి.మీ. మేర నాలుగు వరుసల రోడ్డును ప్రతిపాదించారు. ప్రస్తుతం నన్నూరు టోల్‌ప్లాజా నుంచి ఆత్మకూరు వరకు విస్తరిస్తున్నారు. రూ.1200 కోట్ల వ్యయంతో సుమారు 72 కి.మీ మేర పనులు చేస్తున్నారు.



దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 25 వరకు పెంచినట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి లీలావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ మార్పును గమనించాలని కోరారు.

హంద్రీలో మొలకెత్తిన అక్రమాలు

కర్నూలు నగరం మీదుగా వెళ్లే నదిపై అక్రమార్కులు కన్నేశారు. కొందరు ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకుని గడ్డి పెంచుతున్నారు. గడ్డి ఏపుగా పెరిగేందుకు పెద్దఎత్తున రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. ఫలితంగా నది కలుషితమై విషతుల్యమవుతోంది. ఈ మార్గంలో నిత్యం అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. వారి కళ్ల ముందే దందా సాగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎత్తుగా మట్టి తోలడంతోపాటు నదిలో చెట్లు పెరగడంతో వరద సమయంలో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

- ఈనాడు, కర్నూలు



గడ్డి ఏపుగా పెరిగేలా రసాయన మందులు చల్లుతూ..



నదిలో గడ్డి, చెట్లు పెంచడంతో ప్రవాహానికి తప్పని ఆటంకం

ఐదు తరగతులు.. వంద మంది విద్యార్థులు



కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం హాల్వి గ్రామంలోని ఎంపీయూపీ ప్రాథమిక పాఠశాలలో గదుల కొరతతో ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహిస్తు న్నారు. వంద మంది విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెడుతున్నారు. ఈ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు కింద గదుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి పాత భవనాన్ని కూల్చేశారు. ఆ తర్వాత హాల్విలోని ఉన్నత పాఠశాలలో ఈ పాఠశాలను విలీనం చేయడంతో పనులు నిలిపివేశారు. గతేడాది వరకు ఇక్కడ 1, 2, 3 తరగతులు మాత్రమే నిర్వహించారు. ఈసారి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. మొత్తం 100 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకే గదిలో ఐదు తరగతులను ఒక్క ఉపాధ్యాయిని మాత్రమే కొనసాగిస్తుండటం గమనార్హం.

- న్యూస్‌టుడే, మంత్రాలయం గ్రామీణం

రైతు ఆశలపై పిడుగు

☛ నెల కిందట రూ.2800.. నేడు రూ.2000లోపే

☛ రోడ్లపైనే మొక్కజొన్న ఆరబోత





మొక్కజొన్నను ఆరబెట్టే ప్రయత్నంలో రైతులు, పాడైన కంకులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన వర్షాలు మొక్కజొన్న రైతుల్ని నట్టేట ముంచాయి. లాభాలను కళ్ల జూద్దామనుకున్న వారికి కన్నీటిని మిగిల్చాయి. నంద్యాల జిల్లాలో సాగు చేసే ప్రధాన పంటల్లో మొక్కజొన్న ఒకటి. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాధారణం కన్నా 15 శాతం ఎక్కువ సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో మొక్కజొన్న రైతులకు కంటిమీద కునుకులేక పోయింది. మొదట్లో ధర బాగా ఉన్నా.. తర్వాత కురిసిన అధిక వర్షాలు ఉసూరుమనిపించాయి. లేని స్థితిలో రైతులు దళారులు అడిగిన ధరకే విక్రయిస్తూ నష్టపోతున్నారు.

దారుల నిండా గింజలే

ఆళ్లగడ్డ నియోజకవర్గం పరిధిలో ఏ రోడ్డు చూసినా దాదాపు పదుల కి.మీ. పొడవునా ఆరబోసిన మొక్క జొన్న గింజలే కన్పిస్తున్నాయి. రైతు తన పంటను కాపాడుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. పంటపై ప్లాస్టిక్ పట్టలు కప్పడం, వర్షం ఆగిన వెంటనే తడిసిన గింజలను వేరు చేయడం, మొక్కజొన్న దిగుబడి ఆరేలా ప్రయత్నించడం, రాత్రయితే మళ్లీ పంటను కప్పుకోవడం.. ఇలా ఎంత చేసినా చాలా చోట్ల పంట పాడైంది. గింజల నుంచి మొలకలు వచ్చాయి. కంకులు పూర్తిగా నల్లబడిపోయాయి. రెండు వారాల కిందట మొక్కజొన్న క్వింటా రూ. 2800 వరకు ధర పలకడంతో గతంలో ఎన్న డూలేని రీతిలో లాభాలను కళ్లజూశారు. వర్షాలు కురిశాక మొక్కజొన్న క్వింటా రూ.2 వేల మాత్రమే పలకడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 2225 కంటే ఇది చాలా తక్కువ కావడం గమనార్హం. వర్షాలకు గింజలు తడవడంతో తేమశాతాన్ని సాకుగా చూపుతూ దళారులు ఇష్టానుసారంగా ధరల్ని నిర్ణయిస్తుండటంతో రైతులకు ఏమి చేయాలో తెలియడం లేదు. గత్యంతరం

జిల్లా	సాధారణ సాగు	ప్రస్తుతం సాగు (హెక్టార్లలో)
నంద్యాల	42,210	50,590
కర్నూలు	4,324	5,969

రోడ్లపైనే రూ. 4.5 కోట్ల విలువ

ఆళ్లగడ్డ-అహోబిలం వరకు మరోవైపు నరసాపురం మెట్ట నుంచి చాగలమర్రి వరకు, ఇంకోవైపు నరసాపురం నుంచి రుద్రవరం వరకు ఇలా ఎక్కడ చూసినా రహదారులపై మొక్కజొన్న ఆరబోత కన్పిస్తోంది. దాదాపు 60 కి.మీ. కంటే ఎక్కువ పొడవునా రోడ్లపై రైతులు పంటను ఆరబో శారు. కి.మీ.కు కనీసం 30 క్వింటాళ్ల మొక్కజొన్న ఉన్నట్లు భావించినా 60 కి.మీ. మేర 18 వేల నుంచి 20 వేల వరకు ఉన్నట్లు అంచనా వేస్తు న్నారు. దాదాపు రూ. 4.5 కోట్ల విలువ చేసే పంట వర్షానికి తడిసి ఉండటంతో తమకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర తగ్గకుండా చూడాలి

-నరసింహారెడ్డి, రైతు, ఆళ్లగడ్డ

మొక్కజొన్న ధర తగ్గకుండా చూడాలి. పది రోజుల వ్యవధిలోనే క్వింటాకు రూ.300 వరకు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. ఈసారి మొక్కజొన్నపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చూడాలి.

వైభవంగా మహా పూర్ణాహుతి

☛ అహోబిలంలో ముగిసిన పవిత్రోత్సవాలు

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా మహాపూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా ఆరంభమైన ఈ కార్యక్రమం మంగళవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవిలను యాగశాలలో కొలువుంచి వేదమంత్రాలతో అర్చకులు ప్రాయశ్చిత్త హోమం జరిపి మహాపూర్ణాహుతి నిర్వహించారు. తమిళనాడు నుంచి వచ్చిన ప్రత్యేక అర్చక బృందం వేదప్రబంధ పారాయణాలు పఠించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పంచామృతాలతో అభిషేకించి కుంభప్రోక్షణం జరిపారు. ఉత్సవానికి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పవిత్రోత్సవాల్లో ఆఖరి ఘట్టమైన ఈ కైంకర్యాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిపారు.



స్వామి, అమ్మవార్లు



ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు




మహాపూర్ణాహుతి

ఉచిత శిక్షణ.. డీఎస్సీ సాధనకు నిచ్చెన

☛ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అవకాశం ☛ దరఖాస్తుకు ఈనెల 25 వరకు గడువు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నిరుద్యోగ యువత కలలను సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాటు డీఎస్సీ నిర్వహించకుండా యువత ఆశలపై నీళ్లు చల్లింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు హడావుడిగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినా అది రద్దయ్యింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సుమారు 16 వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఈనెల 3 నుంచి 25వ తేదీ వరకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)-2024 నిర్వహిస్తున్నారు. నవంబరు 2న టెట్ ఫలితాలు విడుదల చేస్తారు. 3వ తేదీన డీఎస్సీ ప్రకటన విడుదల చేసేందుకు విద్యాశాఖ సమాయాత్తం అవుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఆశావహులు సన్నద్ధమవుతున్నారు. కొందరు ప్రైవేటు కేంద్రాల్లో శిక్షణ పొందుతున్నారు. ఈ పరిస్థితుల్లో శిక్షణ కోసం డబ్బు ఖర్చు చేయలేని పేద విద్యార్థులకు అండగా నిలవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.



వేలాది మందికి ప్రయోజనం

డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం డీఎస్సీ శిక్షణలో అనుభవం కలిగిన ప్రైవేటు శిక్షణ సంస్థలను ఎంపిక చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఎక్కువ మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించేలా సన్నద్ధం చేసిన సంస్థలనే ఎంపిక చేస్తారు. వాటి ద్వారా అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తారు. దీని ద్వారా జిల్లాలో వేలాదిమంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రయోజనం కలగనుంది.

దరఖాస్తు చేసుకోండిలా..

ఉపాధ్యాయ విద్యకు సంబంధించిన బీఈడీ, డీఈడీ కోర్సులు పూర్తిచేసి టెట్‌లో అర్హత సాధించిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులు. శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి ఉన్న వారు ఈనెల 25లోపు ఆన్‌లైన్‌లో జ్ఞానభూమి పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలి. అనంతరం అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన వారిని ఎంపిక చేసి ఉచిత శిక్షణ ఇస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

- చింతామణి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి, నంద్యాల

డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఇది మంచి అవకాశం. ఎంపికైన వారికి 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. నంద్యాల జిల్లా నుంచి ఇప్పటి వరకు 224 దరఖాస్తులు వచ్చాయి. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఉపాధ్యాయ ఉద్యోగం పొందడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ అవకాశాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలి.

కలెక్టరేట్ పరిపాలనాధికారిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల కలెక్టరేట్ పరిపాలనాధికారి డక్కా రవికుమార్‌పై సీబీసీఐడీ విచారణకు రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. ఉయ్యాలవాడ తహసీల్దారుగా పనిచేస్తున్న సమయంలో ఆర్వోఆర్ కేసులో మృతి చెందిన వ్యక్తి విచారణకు హాజరైనట్లు చూపించడంతో పాటు స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు రికార్డు చేసి ఆదేశాలు జారీ చేసిన కేసును విచారించిన హైకోర్టు సోమవారం ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. రవికుమార్ జారీ చేసిన ఆర్వోఆర్ ఆర్డర్‌పైన బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసులో రవికుమార్ ప్రాథమికంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని నమ్మిన హైకోర్టు మూడు వారాల్లోపు సీబీసీఐడీ విచారణ చేసి సీల్డ్ కవర్‌లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. రికార్డులను కూడా సీబీసీఐడీ స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, నంద్యాల జిల్లా కలెక్టర్, ఉయ్యాలవాడ తహసీల్దారు కార్యాలయంలోని అధికారులు, రూపనగుడి గ్రామ సిబ్బందిని బాధితులు కేసులో పార్టీలుగా చేర్చారు.

11 వరకు ఇంటర్ రుసుం చెల్లించొచ్చు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్ష రుసుమును నవంబరు 11 వరకు చెల్లించే అవకాశం ఉందని డీఐఈవో బి.సునీత మంగళవారం తెలిపారు. 2024- 25 ఏడాదిలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు రూ.100 అపరాధ రుసుముతో నవంబరు 12 నుంచి 20 వరకు ఫీజు చెల్లించవచ్చని చెప్పారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులు జనరల్ థియరీ సబ్జెక్టులకు రూ. 600, ద్వితీయ సంవత్సరం ప్రయోగ పరీక్షలకు రూ. 275, బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు రూ. 165 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి థియరీ పరీక్షలకు రూ. 1200 చెల్లించాలన్నారు.

శ్రీశైల మండపాల పరిశీలన

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలోని ఆలయ మండపాలను మంగళవారం పుణెకు చెందిన వేంకటేశ్వర ఛారిటబుల్ ట్రస్టు తరపున నిపుణులు పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలోని ప్రాచీనకాలం నాటి మండపాల పైభాగం వర్షాలకు కారకుండా తీసుకోవాల్సిన చర్యల్ని అధ్యయనం చేశారు.

సైబర్ వలలో చిక్కి విలవిల

● రూ.లక్షల్లో మోసాలు ● అప్రమత్తతే రక్షణ




■ ఆదోని పట్టణానికి చెందిన దేవేంద్రరాజు ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ఉన్న నకిలీ వెబ్‌సైట్‌లో 15 రోజులుగా ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయడం ప్రారంభించారు. మొదట్లో ఆ సంస్థ నిర్వాహకులు ట్రేడింగ్ ద్వారా లాభాలు వచ్చేలా చూపారు. దీంతో ఆశపడిన బాధితుడు పెద్ద మొత్తంలో ఆన్‌లైన్‌లో డబ్బులు డిపాజిట్ చేశారు. చివరకు ఆ ఆన్‌లైన్ సంస్థ తనను మోసం చేసిందని గుర్తించేలోపు రూ. 2.54 లక్షలు నష్టపోయారు. న్యాయం చేయాలని ఈ నెల 9వ తేదీన పోలీసులను ఆశ్రయించారు. ఇలాంటి మోసాలు జిల్లాలో పెద్దఎత్తున జరుగుతున్నాయని పోలీసు అధికారులు చెబుతున్నారు.

■ ఆదోని పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోని ఓ హోటల్ నిర్వాహకుడికి ఈ నెల 8వ తేదీన గుర్తుతెలియని సైబర్ నేరగాడు ఫోన్‌చేశాడు. 'నేను 5 కి.మీ. దూరంలో ఉన్నాను. అర్జెంట్‌గా 18 భోజనాలు పార్సిల్ చేయాలి. ఎంతవుతుందో చెబితే ఫోన్‌పే చేస్తాను.' అని చెప్పాడు. బిల్లు రూ. 1880 అయిందని హోటల్ నిర్వాహకుడు చెప్పారు. పొరపాటున రూ. 11,880 ఫోన్‌పే చేశాను.. తిరిగి రూ. 10వేలు పంపాలని సైబర్‌నేరగాడు హోటల్ నిర్వాహకుడికి ఫోన్‌చేశాడు. తన ఖాతాలో డబ్బులు రాలేదని హోటల్ నిర్వాహకుడు చెప్పినా.. వినకుండా సైబర్ నేరగాడు బెదిరింపులకు పాల్పడిన ఘటన ఇటీవల జరిగింది.

■ ఆదోని పట్టణానికి చెందిన ఓ పారిశ్రామికవేత్తను ఓ సైబర్ నేరగాడు ఫోన్ చేశాడు. 'నేను ఆదాయ పన్నుల శాఖ ఆదోని సహాయ అధికారిని మాట్లాడుతున్నా.. మీరు గత ఏడాది ఐటీ రిటర్న్స్ చేసిన ఫైళ్లను సరి చూసుకొని పెట్టుకోండి.. మా జిల్లా అధికారి వచ్చి తనిఖీ చేస్తారు. రికార్డులు సరిగా లేకపోతే మీకు రూ. లక్ష నుంచి రూ. 50 లక్షలు వరకు అపరాధ రుసుం విధిస్తారు' అని చెప్పాడు. ఆందోళనకు గురైన ఆ పారిశ్రామికవేత్తను సైబర్ నేరగాడు మరింత భయపెట్టే ప్రయత్నం చేశాడు. 'జిల్లా అధికారి మీ పరిశ్రమకు తనిఖీకి రాకుండా ఉండాలంటే తక్షణమే రూ. 15వేలు ఫోన్‌పే చేయండి. ఎందుకొచ్చిన గొడవలే.. రూ. 1.50లక్షలు అయ్యేది రూ. 15వేలతో పోతుందనుకుని, వ్యాపారి ఫోన్‌చేశారు. తర్వాత మోసపోయానని తెలుసుకుని మిన్నకుండిపోయారు. ఇలా జిల్లాలో ఎంతో పారిశ్రామికవేత్తలది ఇదే పరిస్థితి.

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని జిల్లా ప్రజలు విలవిల్లాడుతున్నారు. సాంకేతికతను ఇష్టానుసారంగా వినియోగిస్తూ.. అక్రమాలకు పాల్పడుతున్నారు. మోసాలకు కొత్త దారులు వెతుకుతూ.. బ్యాంకు ఖాతాల్లోని డబ్బును కాజేస్తున్నారు. ప్రజలు కష్టపడి బ్యాంకుల్లో దాచుకున్న నగదును సైబర్ నేరగాళ్లు కన్నం వేసి బాధితులకు తీరని నష్టం మిగుల్చుతున్నారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు సరికొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతూ ప్రజల సొమ్ము రూ.లక్షల్లో లాగేసుకుంటున్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.



ఆదోనికి చెందిన ఓ హోటల్ నిర్వాహకుడికి సైబర్ నేరగాడు పంపించిన నకిలీ ఫోన్‌పే చేసినట్లు మెసేజ్

నిర్ధారించుకొని స్పందించాలి

సైబర్ నేరగాళ్లు రోజు రోజుకు కొత్త మార్గాలు అనుసరిస్తున్నారు. ఆన్‌లైన్ మోసాల నుంచి ప్రజలు సురక్షితంగా బయటపడాలంటే అప్రమత్తతే ప్రధాన ఆయుధంగా మలుచుకోవాలి. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ నెంబర్లు చెప్పమని.. తాము ఐటీ అధికారులమని, బ్యాంకు అధికారులమని చెప్పడం వంటి ఫోన్లు చేస్తే అవి ఒకటికి రెండు సార్లు నిర్ధారించుకోవాలి. ప్రధానంగా బ్యాంకు అధికారులు ఎవరూ మీ ఖాతాకు సంబంధించి ఫోన్‌చేసి వివరాలు చెప్పమని అడగరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనే దానిపై పోలీసు శాఖ విస్తృతంగా ప్రచారాలు చేయాలి. ఎలాంటి మోసాలకు పాల్పడుతున్నారనే దానిపై ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉంటే ఇలాంటి మోసాలు జరిగే అవకాశాలు తగ్గుముఖం పడతాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి - సోమన్న, డీఎస్పీ, ఆదోని



సైబర్ నేరగాళ్ల పంథా మార్చుకుని, ప్రజలను మోసం చేస్తున్నారు. వారి మాటలు నమ్మి బ్యాంకు ఖాతాల్లోని డబ్బు పోగొట్టుకుంటున్నారు. మరికొందరు ఐటీ అధికారులమని ప్రజలకు బెదిరింపు కాల్స్ చేస్తున్నారు. ఇది మా దృష్టికి వచ్చింది. లాటరీ టికెట్ తగిలిందనో.. మీకు రుణాలు ఇప్పిస్తామనో వివిధ రకాలుగా ప్రజలకు ఫోన్లు చేసి మాయమాటలు చెప్పి ప్రజల బ్యాంకు ఖాతాల్లో నుంచి డబ్బు కాజేస్తున్నారు. ఇలాంటి వాటికి మోసపోయిన ప్రజలు తక్షణమే సమీప పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ నేరాలపై ఎస్పీ బిందు మాధవ్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలు బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు పోగొట్టుకున్నట్లైతే వెంటనే పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి.. అందులో డబ్బులు ఉంటే బాధితులకు డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

ముగిసిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం పద్మావతినగర్‌లోని డీఎస్ఏ స్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 ఫెన్సింగ్ బాల బాలికల పోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, గురురాజ బ్యాంక్ శిక్షణ కేంద్రం డైరెక్టర్ మౌలాలిరెడ్డి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు జమ్మూకశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆడనున్నట్లు వెల్లడించారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడల విజయవంతానికి సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులకు, విద్యాశాఖ అధికారులకు, డీఎస్ఏ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, ఒలింపిక్ సంఘం కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చలంబాబు, కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ప్రముఖులు, వ్యాయామ ఉపాధ్యాయులు

శిక్షణ నుంచి మినహాయించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : హిందూపురంలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతుల నుంచి ఉర్దూ ఉపాధ్యాయులను మినహాయించాలని ఏపీ ఉర్దూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షురాలు షమీమ్‌బాను డిమాండ్ చేశారు. జిల్లా స్థాయిలోనే ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. నంద్యాల పట్టణం ముల్లాన్‌పేటలోని పాఠశాలలో మంగళవారం ఉర్దూ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ సి.అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ గతంలో క్లిప్, క్లాప్ తదితర శిక్షణ తరగతులు ఉర్దూ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా డివిజన్ స్థాయిలో నిర్వహించేవారన్నారు. ఈ ఏడాది పక్క జిల్లాలోని దూర ప్రాంతంలో తెలుగు మాధ్యమంలో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు నిర్వహించడం సబబు కాదన్నారు. సమావేశంలో నాయకులు ఖాసీం, షబానాపర్వీన్, పర్వీన్‌బాను, హసీనా తదితరులు పాల్గొన్నారు.

దొంగకు రిమాండు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనాల అపహరణ, ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నందికొట్కూరు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు పట్టణం గరీబ్‌నగర్‌కు చెందిన ఖాదర్ పది నెలలుగా నందికొట్కూరులోని కోటావీధిలో అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనిచేసుకునే వాడు. జల్సాలకు అలవాటుపడిన ఖాదర్ డబ్బు కోసం చోరీలకు పాల్పడేవాడు. మంగళవారం పోలీసులను చూసి పారిపోతున్న ఇతన్ని పట్టుకుని విచారించడంతో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకొన్నాడు. ఆత్మకూరు, నందికొట్కూరు, కోడుమూరు, నంద్యాల, మిడుతూరు, బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు ఇళ్లలో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లొచ్చినట్లు వెల్లడైంది. అతన్నుంచి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండుకు పంపినట్లు చెప్పారు.

ఎంపీకి ఘన స్వాగతం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఆస్ట్రేలియా పర్యటన ముగించుకుని నంద్యాలకు వచ్చిన ఎంపీ డా.బైరెడ్డి శబరికి తెదేపా నాయకులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. నాయకులు నరహరి విశ్వనాథరెడ్డి, ఆళ్లగడ్డ జనసేన ఇన్‌ఛార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి, నందికొట్కూరు తెదేపా నాయకులు నాగేశ్వరరావు, డా. కాకరవాడ చిన్న వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, టెలికాం సలహా మండలి సభ్యులు రమేశ్, శ్రీనివాస్ యాదవ్, పెరుమాళ్ల విజయకుమార్, సీతారామిరెడ్డి, అంకిరెడ్డి, సంజీవరెడ్డి, అజయ్ పుల్లారెడ్డి తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి

తిమ్మాపురం (మహానంది), న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. మహానంది మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి గర్భిణికి సాధారణ ప్రసవం చేసేందుకు కృషిచేయాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం తగదన్నారు. ఆసుపత్రిలో జరుగుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వైద్యులు భగవాన్‌దాస్, వేణుకార్తికేయ, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రి భవనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ

పొలాల్లోకి దూసుకెళ్లిన బడి బస్సు

వెలుగోడు, న్యూస్‌టుడే : వెలుగోడు మండలంలోని తిమ్మనపల్లె గ్రామ సమీపంలో ఓ ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అందులో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెలుగోడు పట్టణానికి చెందిన శ్రీలక్ష్మి పాఠశాలకు చెందిన బస్సులో మంగళవారం సాయంత్రం విద్యార్థులను ఇళ్ల వద్ద వదిలేందుకు వెళ్లారు. చిన్న దేవళాపురం గ్రామంలో విద్యార్థులను వదిలిపెట్టి తిరిగి వెలుగోడుకు వెళ్తున్న సమయంలో తిమ్మనపల్లె వద్ద వాహనం అదుపు తప్పి వరి పొలాల్లోకి దూసుకెళ్లింది.



వరి పొలాల్లోకి వెళ్లిన పాఠశాల బస్సు

రైతులకు నష్ట పరిహారం అందించాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

గడివేముల, న్యూస్‌టుడే : అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, జిల్లా సమితి సభ్యుడు వెంకటేశ్వర్లు కోరారు. గడివేములలో మంగళవారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అధిక వర్షాల వల్ల మొక్కజొన్న, సోయాబీన్ దిగుబడులు తడిసిపోవడంతో మొలకలు వచ్చి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రైతులకు ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రబీ సాగు కోసం రాయితీపై విత్తనాలు అందించాలని కోరారు. నాయకులు తిరుపాలు, మద్దిలేటి, సోఫీసాహెబ్ పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం విశేష పూజలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో మంగళవారం లోక కల్యాణార్థం విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి (సుబ్రహ్మణ్యస్వామి), శనగల బసవన్న నందీశ్వరుడు, క్షేత్రపాలకుడు బయలు వీరభద్రస్వామికి అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్పార్చనలు చేసి మంగళ హారతులు సమర్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) నందికొట్కూరు : 94403 61729 ఆత్మకూరు : 90149 09024 నంద్యాల : 98853 28120

నంద్యాల రైతునగరం : సమస్య : ఎంఎస్‌నగర్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- రమణ, స్థానికుడు**

సమస్య : సాయిబాబానగర్‌లో కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. **- పవన్‌కుమార్, స్థానికుడు**

సమాధానం : కార్మికులకు సూచించి కాల్వలు శుభ్రం చేయిస్తాం. త్వరలోనే కుక్కలు పట్టిస్తాం.
- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : వివిధ ప్రజా సంఘాల వినతులను పరిగణనలోకి తీసుకుని నంద్యాలలో డా.బీఆర్.అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. పట్టణంలోని బొమ్మలసత్రంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఇతర ప్రాంతానికి మార్చేందుకు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నామని ఆమె వెల్లడించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మంగళవారం అంబేడ్కర్ విగ్రహం స్థలం మార్పుపై అధికారులతో సమీక్షించారు. నంద్యాల పట్టణంలోని చిన్న చెరువు, మున్సిపల్ టౌన్‌హాల్ ప్రదేశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్వో పద్మజ, ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

నవంబరులో కందిబేడల పంపిణీ

గడివేముల, న్యూస్‌టుడే : చౌక ధరల దుకాణాల ద్వారా నవంబరు నెలలో కందిబేడలు పంపిణీ చేస్తామని తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. రేషన్‌డీలర్లు, వాహనాల ఆపరేటర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యం, చక్కెరతో పాటు కిలో కందిబేడలు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. సీఎస్‌డీటీ ప్రసాద్ పాల్గొన్నారు.

యంత్రాలు మూలకు.. పారిశుద్ధ్యం గాలికి

- ☛ మరమ్మతులు చేయించకుండా పక్కన పెట్టేశారు
- ☛ రూ.కోట్లు దుర్వినియోగం.. కార్మికులకు తప్పని అవస్థలు

నంద్యాల పురపాలకం, పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పురపాలక సంఘంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం పలు యంత్రాలు, వాహనాలు కొనుగోలు చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ పని చేయడంతో పాటు పారిశుద్ధ్య కార్మికులపై భారం తగ్గించడం వీటి ఉద్దేశం. కార్మికులు చేయలేని.. ప్రమాదంతో కూడుకున్న పనులను వీటితో చేయించాల్సి ఉంది. అయితే అధికారులు వాటి కొనుగోలుపై చూపిన శ్రద్ధ నిర్వహణపై పెట్టడం లేదు. దీంతో పలు యంత్రాలు, వాహనాలు నిరుపయోగంగా మారాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చేయూతతో చిన్న, పెద్ద కాంపాక్టర్లు, డోజర్లు, నాలా క్లీనర్లు, రోడ్డు స్వీపింగ్ యంత్రాలు, డబ్బర్ బిన్లు, టిప్పర్లు, పొక్లెయిన్లు అందించారు. వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో కొన్ని నెలలుగా మూలనపడ్డాయి. వాహనాలు, యంత్రాలను బాగు చేయించాలని పారిశుద్ధ్య విభాగం అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో కార్మికులే కాల్వల్లోకి దిగి ప్రమాదకర పరిస్థితుల్లో పూడిక తొలగించాల్సిన దుస్థితి నెలకొంది.

యంత్రాలు	ఉన్నవి	పనిచేస్తున్నవి
చిన్న కంపాక్టర్లు	5	4
పెద్ద కంపాక్టర్లు	2	1
టిప్పర్లు	4	2
స్వీపింగ్ యంత్రాలు	2	0
పొక్లెయిన్	1	0
క్లాప్ ఆటోలు	31	0



తుప్పు పడుతున్న క్లాప్ ఆటోలు

పురపాలక :	నంద్యాల
వార్డులు :	42
గృహాలు :	63 వేలు
రోజూ పోగయ్యే చెత్త :	110 టన్నులు
మురుగు కాల్వలు :	300 కి.మీలు
పారిశుద్ధ్య కార్మికులు :	410 మంది



నిరుపయోగంగా మారిన యంత్రాలు



కాల్వల్లో దిగి పూడిక తీస్తున్న కార్మికులు (పాతచిత్రం)

కొని పక్కన పెట్టారు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పురపాలకలో కాల్వల్లో పూడిక తొలగించేందుకు ఐదేళ్ల కిందట సుమారు రూ.15 లక్షలు వ్యయం చేసి మినీ పొక్లెయిన్ కొనుగోలు చేశారు. దీనిని నడిపే ఆపరేటర్ అందుబాటులో లేకపోవడంతో అవగాహన లేని వ్యక్తికి అప్పగించారు. దీంతో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. కొన్ని రోజులకే దీనిని మూలనపడేశారు. మూడేళ్ల కిందట రూ.50 వేలు ఖర్చుచేసి మరమ్మతులు చేయించినా ప్రయోజనం లేకుండాపోయింది. ప్రస్తుతం ఇది ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపడుతోంది.



నిరుపయోగంగా మినీ పొక్లెయిన్

రూ.కోట్లు ఖర్చు చేసి వదిలేశారు

రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలను చిన్న చిన్న మరమ్మతులు రాగానే మూలనపడేశారు. రహదారులను ఊడ్చేందుకు రెండు స్వీపింగ్ యంత్రాలు తెచ్చారు. 8 నెలలుగా అవి రెండూ పనిచేయకున్నా పట్టించుకోవడం లేదు. లోతైన కాల్వల్లో పూడిక తీసేందుకు కొనుగోలు చేసిన పొక్లెయిన్ రెండు నెలలుగా పనిచేయడం లేదు. చెత్త తరలించేందుకు పది ట్రాక్టర్లు ఉన్నా తరచూ మరమ్మతులు చేయించాల్సి వస్తోంది. ఇంటింటి చెత్త సేకరించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా కేటాయించిన ఆటోలు ఏడాదిగా మూలకు చేరి తుప్పు పట్టినా వాటిని పట్టించుకునే వారు కరవయ్యారు.

పొలంబడి.. విజ్ఞాన సవ్వడి



నంద్యాల మండలంలోని కొత్తపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం వృత్తి విద్యా శిక్షకురాలు సువర్ణ ఆధ్వర్యంలో పంటల పరిశీలనకు పొలం బాట పట్టారు. పట్టణంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని సందర్శించారు. అక్కడ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో సాగవుతున్న పత్తి పంటను పరిశీలించారు. శాస్త్రవేత్తలతో మాట్లాడి పంటల సాగు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యల గురించి తెలుసుకున్నారు.
- న్యూస్‌టుడే, నంద్యాల గ్రామీణం

అంతరాయం లేకుండా విద్యుత్తు ఇవ్వండి

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : సున్నిపెంట కాలనీకి అంతరాయాల్లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు నాగిరెడ్డి, ఓబులయ్య, పులిరాజు, అన్వర్‌బాషా కోరారు. సున్నిపెంటలోని ఎస్పీడీసీఎల్ సబ్‌స్టేషన్ ముందు మంగళవారం వారు ధర్నా నిర్వహించారు. గత 15 రోజుల నుంచి కాలనీలో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. సమస్య పరిష్కరించాలని ఎస్పీడీసీఎల్ ఏఈ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మల్లికార్జున, నాగరాజు, దావీదు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

పగిడ్యాల, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పేర్కొన్నారు. పగిడ్యాల తహసీల్దారు కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో సమస్యలు గుర్తించి పరిష్కరిస్తామన్నారు. భూ, సమస్యలు, రోడ్లు, తాగునీరు, తదితర సమస్యలపై నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అనంతరం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరాముడు, ఎంపీడీవో సుమిత్రమ్మ, తెదేపా నాయకులు పలుచాని మహేశ్వరరెడ్డి, రామిరెడ్డి, దామోదర్‌రెడ్డి, పుల్యాల వాసురెడ్డి, లోకానందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

పాములపాడు, న్యూస్‌టుడే : సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు గ్రామీణ సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి సూచించారు. పాములపాడు ఎస్సై సురేశ్ ఆధ్వర్యంలో భానుముక్కల గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, మహిళల చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : నిరుద్యోగ యువత ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జిష్ణునాగవిజయ్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించారు. నాలుగు ప్రైవేటు కంపెనీల సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. 65 మంది అభ్యర్థులు పాల్గొనగా 25 మంది ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పద్మావతి బాయి. ఉపాధి కల్పనాధికారి సుబ్బన్న పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో వెలుగులోకి సామర్థ్యాలు





నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే : పోటీ పరీక్షలతో విద్యార్థుల సామర్థ్యాలు వెలుగులోకి వస్తాయని నంద్యాల బాల అకాడమీ రవీంద్ర ఉన్నత పాఠశాల అధినేత రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత పేర్కొన్నారు. స్థానిక పార్కు రోడ్డులోని పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు జరిగాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఫహీమ, రేఖప్రియహర్షిత, మనోజ్‌లకు బహుమతులు అందజేశారు.





నందికొట్కూరు, న్యూస్‌టుడే : 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థుల ప్రతిభకు పదును పెడతాయని శ్రీనవనంది పాఠశాల కరస్పాండెంట్ బద్దుల శ్రీధర్ పేర్కొన్నారు. నందికొట్కూరు పట్టణంలోని శ్రీనవనంది పాఠశాలలో సోమవారం 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు- విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం' అనే అంశంపై 'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు జరిగాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పదో తరగతి విద్యార్థిని డి.సుజిత, 9వ తరగతి చదువుతున్న షేక్ సన, 8వ తరగతి విద్యార్థిని జి.సుప్రియలకు పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్, ప్రధానోపాధ్యాయుడు నరసప్ప బహుమతులు అందజేశారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



తహసీల్దారుకు సమస్యలు విన్నవిస్తున్న రైతులు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : రీసర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని తహసీల్దారు సుభద్రమ్మ రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. మండలంలోని భానుముక్కల గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. భూ సర్వే వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల నుంచి వినతులు స్వీకరించారు.

అయ్యలూరు (నంద్యాల గ్రామీణం) : రీసర్వే వల్ల కలిగిన ఇబ్బందులను రైతులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దారు ప్రియదర్శిని సూచించారు. మండలంలోని అయ్యలూరులో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి చెందిన 66 మంది రైతులు రీసర్వేతో తమకు ఇబ్బందులు కలిగాయంటూ అర్జీలు ఇచ్చినట్లు రీసర్వే ఉప తహసీల్దారు నాగరాజు తెలిపారు.

గాజులపల్లె (మహానంది), న్యూస్‌టుడే : భూ సమస్యల పరిష్కారమే గ్రామసభల లక్ష్యమని తహసీల్దారు పి.రమాదేవి పేర్కొన్నారు. మహానంది మండలం గాజులపల్లె సచివాలయం-2 పరిధిలోని బసవాపురం, గాజులపల్లె గ్రామాల రైతుల కోసం మంగళవారం గ్రామసభల నిర్వహించారు. రీసర్వే ఉప తహసీల్దారు బి.కామేశ్వరరెడ్డి, ఆర్ఐ వెంకటసుబ్బారావు, మండల సర్వేయర్ రఫీ, మండల తెదేపా అధ్యక్షుడు ఉల్లి మధు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : రీసర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య రెవెన్యూ అధికారులకు సూచించారు. మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. పలువురు రైతులు వినతిపత్రాలు అందజేశారు. తెదేపా నాయకుడు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భోజనం (బండిఆత్మకూరు), న్యూస్‌టుడే : రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికే ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఆల్ఫ్రెడ్ తెలిపారు. మండలంలోని భోజనం గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల నుంచి 84 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే : రీసర్వే చేపట్టిన గ్రామాల్లో భూ సమస్యలుంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దారు రత్నరాధిక సూచించారు. మండల పరిధిలోని కరివేన గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి 35 అర్జీలు స్వీకరించారు.

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని బూజునూరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించినట్లు తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. రీసర్వే సమస్యలపై 18 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఉల్లిపాయల వ్యాపారి మృతి

మేడికొండూరు, న్యూస్‌టుడే : గుంటూరు జిల్లా మేడికొండూరు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్రాహ్మణకొట్కూరుకు చెందిన ఉల్లిపాయల వ్యాపారి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు వెల్లడించిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరుకు చెందిన తెలుగు యల్లప్ప (61) ఉల్లిపాయల వ్యాపారం చేస్తుంటారు. వ్యాపారం నిమిత్తం లారీలో ఉల్లిపాయలు తీసుకుని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బయలుదేరారు. మంగళవారం తెల్లవారుజామున మేడికొండూరు మండలంలోని డోకిపర్రు శివారు వద్ద దారికి అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో యల్లప్ప, పక్కనే ఉన్న బాషా తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108 వాహనంలో గుంటూరు సర్వజనాసుపత్రి తరలించగా.. చికిత్స పొందుతూ యల్లప్ప మృతి చెందారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నల్లమలలో కొండను ఢీకొన్న లారీ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : గుంటూరు నుంచి కర్నూలు వెళ్తున్న ఓ లారీ నల్లమల ఘాట్‌రోడ్డు మలుపులో అదుపుతప్పి కొండను ఢీకొట్టింది. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. మంగళవారం సాయంత్రం వాహనాన్ని పొక్లెయిన్ సాయంతో వెనక్కి లాగి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూశారు.

పల్లె పిల్లలు..
త్రోబాల్‌లో పిడుగులు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్న పట్టుదల ఉండాలేకాని పేదరికం, గ్రామీణ నేపథ్యం అడ్డంకి కావని నిరూపిస్తున్నారు పాములపాడు మండల విద్యార్థులు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ.. సరైన సౌకర్యాలు, శిక్షణ లేకున్నా కఠోర సాధన, గురువుల ప్రోత్సాహంతో త్రోబాల్ క్రీడలో ప్రతిభ చూపుతున్నారు. పోటీల్లో మెరుగైన ప్రదర్శన చేస్తూ విజయ పథంలో సాగుతున్నారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి ప్రశంసలు అందుకుంటున్నారు.

అర్జున్.. బరిలో మెరిసెన్

పాములపాడు మండల కేంద్రానికి చెందిన శ్యామలమ్మ, శాంతకుమార్ దంపతుల కుమారుడు అర్జున్. స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. త్రోబాల్ క్రీడపై ఆసక్తితో పాఠశాల పీఈటీ సాయికృష్ణ వద్ద శిక్షణ తీసుకున్నాడు. మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో జరిగిన పలు పోటీల్లో రాణించాడు. గతేడాది డిసెంబరు 10 నుంచి 12 వరకు ఏలూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ ఏడాది సెప్టెంబరులో కర్నూలు ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలో మంచి క్రీడాకారుడిగా గుర్తింపు పొంది క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమంటున్నాడు అర్జున్.



తరుణి.. జాతీయస్థాయిలో రాణించాలని

పాములపాడు మండలం వేంపెంట గ్రామానికి చెందిన మహేశ్వరీబాయి, స్వామినాయక్ దంపతుల కుమార్తె తరుణిబాయి. తండ్రి క్యాన్సర్ వ్యాధితో మృతి చెందారు. తల్లి కూలి పనులు చేస్తూ తరుణిబాయిని చదివిస్తున్నారు. ఈ విద్యార్థిని ప్రస్తుతం నెరవాడ మెట్ట గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆటల పట్ల ఆసక్తితో త్రోబాల్ క్రీడ నేర్చుకుంది. పీఈటీ నాగరాజు శిక్షణలో మెలకువలు నేర్చుకుని మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి పోటీల్లో రాణించింది. గతేడాది డిసెంబరు 10 నుంచి 12 వరకు నంద్యాల పురపాలక పాఠశాల మైదానంలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో కీలకంగా ఆడి జట్టును ప్రథమ స్థానంలో నిలిపింది. జాతీయస్థాయిలో ఉత్తమ క్రీడాకారిణిగా గుర్తింపు పొందడమే తన లక్ష్యమని చెబుతోంది తరుణి.



మద్యం దుకాణం తొలగించాలని ధర్నా



మద్యం దుకాణం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని తొగర్చేడు గ్రామ రహదారిలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని మహిళలు ధర్నా నిర్వహించారు. మహిళలు, గ్రామస్థులు మంగళవారం మద్యం దుకాణం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. నంద్యాల మండల పరిధిలోని మద్యం దుకాణాన్ని తొగర్చేడుకు వెళ్లే దారిలో ఏర్పాటు చేశారని తెలిపారు. నిత్యం మహిళలు, ఆడపిల్లలు తిరిగే దారిలో దీనిని ఏర్పాటు చేయడం వల్ల రక్షణ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు.

రాయితీ రుణాలు మంజూరు చేయాలి



ధర్నా చేస్తున్న ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : చేతివృత్తిదారులకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో రుణాలు ఇవ్వాలని ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య నంద్యాల జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా బీసీ సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ గోవర్ధన్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో సుమారు 30 శాతం మంది జనాభా 28 రకాల చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. గత వైకాపా ప్రభుత్వం చేతివృత్తిదారులను ఆదుకోకుండా మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం చేతివృత్తిదారులకు రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని కోరారు. ధర్నాలో నాయకులు డి.శ్రీనివాసులు, రంగస్వామి, రాఘవేంద్ర, బాలనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమానులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నకిలీ విలేకరులు, విద్యార్థి సంఘాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ప్రైవేటు పాఠశాలల యజమానుల సంఘం సభ్యులు కోరారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారెడ్డి, బి.భాస్కర్, కోశాధికారి హుసేన్ బాషా మంగళవారం ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాల నిలిపివేత

గాజులపల్లె (మహానంది), న్యూస్‌టుడే : మహానంది మండలం గాజులపల్లె మెట్టలోని శ్రీరాఘవ ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో రూ.1.10 లక్షల విలువైన 5.25 టన్నుల ఎరువుల విక్రయాలను నిలిపివేసినట్లు మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. గాజులపల్లె మెట్టలోని ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. శ్రీరాఘవ దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిగినట్లుగా గుర్తించామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

నందికొట్కూరు, న్యూస్‌టుడే : గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత అని నందికొట్కూరు గ్రామీణం ఎఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి సోమవారం చంద్రబాబునాయుడు సేవా సమితి, జనసేన పార్టీ కార్యకర్తలు, ఆర్ఎంపీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సీబీఎన్ సేవా సమితి వాలంటీర్లు, జనసేన పార్టీ నాయకులు, ఆర్ఎంపీ వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీబీఎన్, జనసేన నాయకులు, ఆర్ఎంపీ వైద్యులు, విద్యార్థులు

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

గడివేముల, న్యూస్‌టుడే : విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని ఎస్సై నాగార్జునరెడ్డి కొనియాడారు. గడివేములలోని రాజరాజేశ్వరి పాఠశాలలో మంగళవారం పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం పనిచేస్తుంటారని తెలిపారు. పిల్లలు అధికంగా చరవాణులకు అలవాటు పడటం వల్ల శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ రామేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్రరావు ఎస్సైని సన్మానించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సూచికలు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదాల నివారణకు గుర్తించిన ప్రాంతాల్లో వేగ నిరోధకాలు, సూచికలు ఏర్పాటు చేసినట్లు నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తెలిపారు. జాతీయ రహదారిలో శాంతిరాం కళాశాల దగ్గర, వివిధ ప్రాంతాల్లో వేగ నిరోధకాలు ఏర్పాటు చేయడంతో పాటు వాహనదారులు వేగ నియంత్రణ పాటించేలా సూచికలు ఏర్పాటు చేశారు. వాహనదారులు అధిక వేగంతో ప్రయాణించడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. టోల్‌ప్లాజా, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ఉయ్యాలవాడలో బోనాల పండగ



ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: ఉయ్యాలవాడలో వర్షం సకాలంలో కురవడంతో గ్రామస్థులు గంగమ్మకు మంగళవారం బోనాల పండగ జరిపారు. ఊరంతా బోనాలతో బయల్దేరారు. పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని స్థానికులంతా కోరుకున్నారు.

బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్థులు

నిధుల దుర్వినియోగంపై విచారణ

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిధుల దుర్వినియోగంపై జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి శారదాబాయి, డీసీబీఎస్ అధికారిణి మాధవిలత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి ప్రసన్న లక్ష్మి, సీనియర్ సహాయకులు శివనాగిరెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు మండల వైద్యాధికారి స్థానికంగా నివాసం లేరని హెచ్‌డీసీ ఛైర్మన్ వైద్యాధికారిపై ఫిర్యాదు చేశారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

బనగానపల్లి: **సమస్య:** బనగానపల్లిలోని గ్రామ పంచాయతీకి వెళ్లే రోడ్డు నిండా గోతులే ఉన్నాయి. – మహమ్మద్ గౌస్.

సమాధానం: కంకర వేసి పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. –సతీష్‌కుమార్ రెడ్డి, ఈవో

చాగలమర్రి: **సమస్య:** కలుగొట్లపల్లె, మల్లెవేముల సమీపంలోని పంట పొలాలపై జింకలు, పందులు దాడులు చేస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. –మనోహర్‌రెడ్డి, రైతు.

సమాధానం: పొలాలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. –రామకృష్ణ, అటవీశాఖ అధికారి.

శిరివెళ్ల: **సమస్య:** యర్రగుంట్ల బస్టాప్ వద్ద విభాగినిపై తొలగించిన పిచ్చిమొక్కలను తొలగించాలి –జగదీష్

సమాధానం: సిబ్బందితో తరలిస్తాం. –హరిలీల, పంచాయతీ కార్యదర్శి.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కోటకందుకూరు(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: విద్యార్థులు కంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వైద్యాధికారి రమేష్ పేర్కొన్నారు. కోటకందుకూరు ఆదర్శ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రధానాచార్యులు రాజు, ఆశాకార్యకర్త విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ శివబ్రహ్మం పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న రమేష్

ప్రధాన రహదారులపై సర్వే

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పట్టణాల్లో రద్దీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలకుగానూ పట్టణ ప్రణాళిక కార్యదర్శులు సర్వే నిర్వహిస్తున్నారు. మంగళవారం పట్టణంలోని సీఎస్ఐ చర్చి నుంచి టీబీ రోడ్డు వరకు రహదారుల కొలతలు తీసుకున్నారు.

శనగ విత్తనాలు సిద్ధం

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: రబీలో శనగ సాగు చేసే రైతులకు రాయితీపై విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సుధాకరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షత వహించారు. ఇప్పటికి 720 క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేశామన్నారు.

నాణ్యమైన భోజనాన్ని ఇవ్వాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు శశిధర్‌రెడ్డి, ప్రవీణ్ కోరారు. పాఠశాలలో బోరుకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని హెచ్‌ఎంను కోరారు.

ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ఐటీఐలో పలు కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ప్రసాదరెడ్డి సూచించారు. మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఉద్యోగ మేళాకు 52 మంది హాజరు కాగా 20 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపల్ తెలిపారు.

అందని సాయం..మానని గాయం



గత రబీలో దెబ్బతిన్న శనగ పంట


కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: గతేడాది రబీలో వరుణుడు మొహం చాటేయడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కరవు పరిస్థితులు ఎదురయ్యాయని విలవిల్లాడారు. గత వైకాపా ప్రభుత్వం కరవు మండలాలు ప్రకటించి సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో సాయం అందడంలో జాప్యం జరగడంతో నష్టపోయారు. వచ్చిన కరవుబృందం పర్యటించి వెళ్లి నాలుగు నెలలు గడిచినా ఎటువంటి సాయం అందకపోవడంతో ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాలు ఉన్నాయి. గత రబీలో శనగ, జొన్న, మినుము, పెసర, మొక్కజొన్న, కంది, పొగాకు సాగు చేశారు. రబీలో వర్షాలు లేని కారణంగా శనగ సాధారణ సాగు విస్తీర్ణం 41,204 హెక్టార్లు ఉండగా కేవలం 27,865 హెక్టార్లలో మాత్రమే సాగైంది. అక్టోబరు నుంచి జనవరి వరకు రబీ పంటలకు చినుకు జాడ కరవైంది. పంటలన్నీ ఎండలకు ఎండి దెబ్బతిన్నాయి.

☛ కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో 23,985మంది రైతులు 25,065.32హెక్టార్లలో నష్టపోగా రూ.24,31,79,395 కోల్పోయినట్లు అంచనా వేశారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 5ఎకరాల వరకు పరిహారం అందించేలా, శనగ, మినుము పంటలకు హెక్టారుకు రూ.10 వేలు, జొన్నకు రూ.8,500 చొప్పున లెక్క కట్టి అధికారులు నివేదికలు పంపించారు. గత జూన్ 20న అప్పటి జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కరవు బృందం భీమునిపాడు, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలం హరివరం గ్రామాల్లో పర్యటించి బాధిత రైతులతో సమావేశం నిర్వహించింది. మళ్లీ రబీ వచ్చినా రైతులకు ఒక్క రూపాయి కరవు సాయం అందలేదు. అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

కరవు మండలాల వారీగా పంటనష్టం వివరాలు

మండలం	నష్టపోయిన రైతులు	విస్తీర్ణం (హెక్టార్లలో)	అంచనావేసిన నష్టం విలువ
కోవెలకుంట్ల	5,284	5821.25	5,65,63,430
సంజామల	5,328	5551.61	5,30,22,320
అవుకు	2,786	2528.58	2,40,31,935
కొలిమిగుండ్ల	729	724.61	72,08,615
దొర్నిపాడు	3,486	3003.70	2,82,48,650
ఉయ్యాలవాడ	6,372	7435.57	7,41,04,445

ఎన్నాళ్లీ ఎదురుచూపులు – చెన్నకృష్ణారెడ్డి, జౌలదరాశి



గత రబీలో 16 ఎకరాల్లో శనగ సాగు చేశా. ఎకరాకు రూ.14వేల చొప్పున పెట్టుబడి పెట్టా. వానలు లేకపోవడంతో పంట దెబ్బతిని ఎకరాకు 1 బస్తా దిగుబడి వచ్చి తీవ్రంగా నష్టపోయా. కరవు మండలాల్లో కేంద్ర బృందం పర్యటించడంతో సాయం అందుతుందనుకున్నాం. ఇప్పుడు మళ్లీ రబీ పంటలు ప్రారంభమైనా కరవు సాయం అందలేదు.

నిధులు మంజూరు కాగానే ఖాతాలకు జమ – సుధాకర్, ఏడీఏ, కోవెలకుంట్ల



కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆరు మండలాలకు కలిపి మొత్తం రూ.24.31కోట్లు పంట నష్టం అంచనా వేసి నివేదికలు పంపాం. కేంద్రం నిధులు విడుదల చేయగానే రైతుల ఖాతాలకు జమ చేస్తాం.

నిండా గుంతలు..తీరని కష్టాలు

బనగానపల్లి పట్టణం ఆంజనేయ స్వామి ఆలయానికి సమీపాన ఉన్న రహదారిపై గుంతలు పడటంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఈవో సతీష్ కుమార్‌రెడ్డి దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. –న్యూస్‌టుడే, బనగానపల్లి



జొన్న సంచులు దగ్ధం..రూ.8 కోట్ల నష్టం

నల్లగట్ల(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: నల్లగట్లలోని రాజ్యలక్ష్మి రూరల్ ఫార్మర్ గోదాంలో మంగళవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో 32,289 జొన్న సంచులు నిప్పంటుకొని కాలిపోవడంతో సుమారు రూ.8 కోట్ల నష్టం వాటిల్లినట్లు యజమాని బద్రి రామలింగయ్య వాపోయారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

వికసించిన ప్రతిభ



విజేతలకు బహుమతులు అందిస్తున్న విజయనాగరాజు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో వివిధ పోటీలతో ప్రోత్సహించడం అభినందనీయమని సుమేధా ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ విజయనాగరాజు పేర్కొన్నారు. బేతంచెర్ల పట్టణంలోని సుమేధా ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్.సత్వార్ (10వ తరగతి), జి.సుచైత్ర వైష్ణవి (10వ తరగతి), ఎస్.అబ్దుల్ బాష (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవడంతో పాఠశాల కరస్పాండెంట్ బహుమతులను అందజేశారు. పాఠశాల కో-ఆర్డినేటర్ మహేశ్వరమ్మ, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు పుల్లం రాజు, మధుసూదన్‌రెడ్డి, హసీనా తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

పోటీల్లో నిలిచి..విజేతలుగా మెరిసి



విజేతలకు బహుమతులు ఇస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయిని పద్మావతమ్మ పేర్కొన్నారు. మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' పై వ్యాసరచన పోటీలకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన పదో తరగతికి చెందిన డి. రెహమాన్‌ఖాన్, బి.రంగ, ఎస్.షరీఫ్‌లకు పాఠశాల ప్రధానోపాధ్యాయినితో పాటు సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, బాబు, వెంకటరమణ, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మయ్య, లక్ష్మీ ప్రభావతి, రాధ, హుస్సేన్‌భాను, సుబ్బారెడ్డి, అల్లిపీరా బహుమతులు అందజేశారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉపాధి నిధులతో పల్లెల్లో ప్రగతిబాట

★ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాల్సిందే

-'న్యూస్‌టుడే'తో డీఎల్‌డీవో నరసింహారెడ్డి

ముఖాముఖి



డోన్, న్యూస్‌టుడే: పల్లెల్లో సీసీ రహదారులు, కాలువల పనులు సంక్రాంతిలోగా పూర్తికి చర్యలు తీసుకుంటామని డీఎల్‌డీవో నరసింహారెడ్డి తెలిపారు. పల్లె పండగ ద్వారా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద సీసీ రహదారులు, కాలువల ఏర్పాటుతో పాటు పలు పనులు చేపడుతున్నామన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. ఉపాధి నిధులతో పల్లెలు ప్రగతిబాట పట్టేలా చూస్తామన్నారు. మంగళవారం 'న్యూస్‌టుడే'కు ఆయన పలు విషయాలు తెలిపారు.

విధుల్లో చేరకపోతే చర్యలు

సచివాలయ సిబ్బంది బదిలీల ప్రక్రియ జరుగుతున్నందున విధుల్లో చేరని వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వబోతున్నాం. ఎందుకు చేరడం లేదనే విషయాలు తెలియజేయాలి. సిబ్బంది కొన్నిచోట్ల సమయపాలన పాటించటం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఎంపీడీవోలు, సచివాలయ సిబ్బందితో మాట్లాడి సమయపాలన పాటించేలా చూస్తాం. విధుల్లో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

సిబ్బంది కొరత లేకుండా చర్యలు

సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఉంటారు. కొందరు వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బందిని వారి శాఖలకు పంపించాలనే ఆలోచన ఉంది. గ్రామ సచివాలయాలను పంచాయతీల్లోనే కలిపేయాలనే ఆలోచన ఉంది. ఇలా చేస్తే సచివాలయ సిబ్బందిని కలిపితే అన్ని గ్రామ పంచాయతీలకు సిబ్బంది ఉంటారు. కొరతేమీ ఉండదు.


అసంపూర్తి నిర్మాణాలతో ఎలా...?

గ్రామ సచివాలయలతో పాటు ఇతర భవనాలు 90 శాతం పూర్తయి చివరిదశలో ఉన్న వాటిని పూర్తి చేయమని చెప్పారు. ఆర్బీకేలు, పునాదులు, బేస్‌మెంటు స్థాయిల్లో ఉన్న వాటిని ఏంచేయాలనేది ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూస్తున్నాం.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు

గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాం. ఆయా మండలాల ఎంపీడీవోలతో అభివృద్ధి పనులు చేపట్టేలా చూస్తాం. డోన్ పరిధిలో ఎక్కువగా ఉపాధిహామీ కింద ఉద్యాన పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. అటువంటి వారిని ప్రోత్సహిస్తాం.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సుధాకర్



ప్యాపిలి, న్యూస్‌టుడే: డోన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ప్యాపిలి మండలం గార్లదిన్నెకు చెందిన కుమ్మరి సుధాకర్ ఎన్నికైనట్లు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యదర్శిగా ప్రభాకర్ యాదవ్, ట్రెజరర్‌గా రాజ్‌కుమార్‌తో పాటు మరో నలుగురు ఎన్నికయ్యారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని విన్నపం

డోన్, న్యూస్‌టుడే: సీసంగుంతలలో గ్రామ పంచాయతీ కార్యాలయంతో పాటు, సచివాలయం ఏర్పాటయ్యేలా చూడాలని గ్రామస్థులంతా మంగళవారం ఎమ్మెల్యేకోట్లకు ప్రజాఫిర్యాదుల వేదికలో విన్నవించారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డోన్ పట్టణంతో పాటు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వినతులు అందజేశారు. వారం పదిరోజుల్లో సమస్యలు పరిష్కారం జరిగేలా అధికారులకు సూచించామని ఎమ్మెల్యే తెలిపారు. ఉంగరానిగుండ్లకు చెందిన తెదేపా నాయకుడు చిన్నమద్ది కుమారుడు గాయపడి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే కోట్ల పరామర్శించారు.



సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కోట్లకు విన్నవిస్తున్న గ్రామస్థులు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పలు బస్సు సర్వీసులు తెలియజేసి అవి పెరిగేలా చూస్తామని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. డోన్ నుంచి వెల్దుర్తి, కర్నూలుకు, అక్కడి నుంచి కోడుమూరు, ఎమ్మిగనూరు మీదుగా ఆదోనికి డోన్ ఆర్టీసీ డిపోకు చెందిన కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు.

ఐటీఐ విద్యార్థుల పయనం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని ఎలక్ట్రీషియన్, వైర్‌మెన్ ట్రేడుల సీనియర్ విద్యార్థులు బెంగళూరులోని దొడ్డబళ్లాపూర్‌కు వెళ్లినట్లు ఏటీవో బద్దల ప్రసాద్ మంగళవారం తెలిపారు. గురు ఎంటర్ ప్రైజెస్ అండ్ సప్తగిరి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో నైపుణ్యాల పెంపునకు 49 మంది మూడు నెలల పాటు తర్ఫీదు పొందనున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చేస్తాం: ఎమ్మెల్యే

రుద్రవరం, న్యూస్‌టుడే: వినతిపత్రం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. మంగళవారం రుద్రవరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని సమావేశ భవనంలో ప్రజాసమస్యల పరిష్కర వేదికలో ఆమె పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి వినతి నేరుగా సీఎం కార్యాలయానికి తీసుకెళ్తామన్నారు. సీసీ రహదారులు, పలు అభివృద్ధి పనులకు భూమిపూజలు జరుగుతున్నాయని, ఇది ప్రజల ప్రభుత్వం అని, పార్టీలకు అతీతంగా పనులు చేస్తామన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న అఖిలప్రియ

అవీ.. ఇవీ.. అన్నీ..

అవుకు, న్యూస్‌టుడే: సమగ్ర భూసర్వేలో సమస్యలను రైతు సదస్సుల ద్వారా పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ సవర్ణదేవి తెలిపారు. మంగళవారం నిచ్చెనమెట్లలో సమావేశం నిర్వహించి పలు సూచనలు అందించారు.

కోవెలకుంట్ల: బద్వేల్‌లో హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని నిరుద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజ్ మంగళవారం ప్రకటనలో డిమాండు చేశారు.

కోవెలకుంట్ల: కంపమల్లలో బుధవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పవన్‌కుమార్ రెడ్డి మంగళవారం తెలిపారు. రీ సర్వేలో ఏవైనా భూ సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు.

కోవెలకుంట్ల: రీ సర్వేలో తలెత్తిన భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. లింగాలలో సభ నిర్వహించారు.

బనగానపల్లి గ్రామీణం: బనగానపల్లి పట్టణంలోని పొదుపు కార్యాలయంలో ఏపీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ)పై వీఓఏలకు అవగాహన కల్పించారు.

ముత్యాలపాడు(చాగలమర్రి): సస్యరక్షణా చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనేతాజీ తెలియజేశారు. ముత్యాలపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు.

చాగలమర్రి: రీసర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తహసీల్దారు రవికుమార్ తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని పాత కార్యాలయ ఆవరణలో మంగళవారం గ్రామసభను నిర్వహించారు.

బేతంచెర్ల: గూటుపల్లెకు చెందిన గుర్రమ్మ నుంచి 20 లీటర్లు, కొలుములపల్లె కురువ వంశీ, కురువ శేఖర్‌ల నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ చంద్రశేఖరప్ప, ఏఎస్సై వెంకటనారాయణ తెలిపారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలో ఇద్దరిని అరెస్టు చేసి నుంచి 52 మద్యం సీసాలను పట్టణ పోలీసుల స్వాధీనం చేసుకున్నారు.

ఆళ్లగడ్డ: రామచంద్రాపురంలో ఒకరిని అరెస్టు చేసి నుంచి 20 మద్యం సీసాలను దొర్నిపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బనగానపల్లి గ్రామీణం: బనగానపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు గడువు ఈ నెల 25 వరకు పొడిగించినట్లు సీడీపీవో ఉమామహేశ్వరమ్మ మంగళవారం తెలిపారు.

తిమ్మాపురం(బనగానపల్లి గ్రామీణం): రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని జిల్లా సెరికల్చర్ అధికారి పరమేశ్వరమ్మ పేర్కొన్నారు. తిమ్మాపురం, బనగానపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు.

అప్పలాపురం (బనగానపల్లి గ్రామీణం): భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల తహసీల్దారు నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. అప్పలాపురంలో గ్రామసభ నిర్వహించారు.

బుర్రారెడ్డిపల్లె (దొర్నిపాడు): బుర్రారెడ్డిపల్లె గ్రామంలో తహసీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో మంగళవారం రీసర్వే సందర్భంగా గ్రామసభ నిర్వహించారు.

శిరివెళ్ల: అయోడిన్ లేని ఉప్పు వాడకం ద్వారా థైరాయిడ్ సమస్యలు ఉత్పన్నమౌతాయని జిల్లాబాల స్వస్థ ఆరోగ్య ప్రోగ్రాం అధికారి డా: కాంతారావు సూచించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఎస్‌వోతో సమావేశమై పలు సూచనలిచ్చారు.

బేతంచెర్ల: పిల్లల్ని పనిలో పెట్టుకుంటే రెండు సంవత్సరాల జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తామని డోన్, బనగానపల్లె కార్మికశాఖాధికారులు నీలిమ సంధ్య, శోభారాణి హెచ్చరించారు. మంగళవారం బేతంచెర్ల పట్టణంలో తనిఖీలు చేశారు.

బాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: బాచేపల్లె గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు ఆరంభమయ్యాయి. మూడు రోజులు భగవద్గీత, రామాయణం, మహాభారతం ప్రవచనాలు, భజన, శుక్రవారం గోపూజ, కుంకుమార్చన ఉంటాయని తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు వేంకటరెడ్డి తెలిపారు.

ఆళ్లగడ్డ: గత 10 రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలకు నష్టం జరుగుతోంది. మంగళవారం సాయంత్రం ఏకధాటిగా గంట పాటు భారీ వర్షం కురిసింది. మొక్కజొన్న రైతులు ఇబ్బందులు పడ్డారు.

పల్లె కబుర్లు

అవుకు: కొండమనాయునిల పల్లెకు చెందిన పెద్ద సంకన్నను అదుపులోనికి తీసుకొని 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజారెడ్డి మంగళవారం తెలిపారు

అవుకు: కునుకుంట్లలో సాగు చేసిన పొగాకు పంటను వ్యవసాయాధికారి అబ్బుల్‌హక్ మంగళవారం పరిశీలించారు. శాస్త్రీయ పద్ధతిలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంటను కాపాడవచ్చునన్నారు.

సంజామల: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తామని తహసీల్దారు అనిల్‌కుమార్ తెలిపారు. పేరుసోములలో మంగళవారం రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు.

ఏనుగుమర్రి (ప్యాపిలి): పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తోందని నంద్యాల జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఏనుగమర్రి గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడి పండ్ల తోటలను పరిశీలించారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని జలదుర్గం ఎస్సై నాగార్జున సూచించారు. మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు.


సౌకర్యాల్లేక సతమతం

★ డిగ్రీ విద్యార్థులకు కష్టాలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో డిగ్రీ కళాశాల విద్యార్థులు కష్టాలతోనే సహవాసం చేస్తున్నారు. సౌకర్యాల లేమితో విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది అల్లాడిపోతున్నారు. గత ప్రభుత్వం గొప్పలకు పోయి 2022లో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసింది. ఇదే గొప్ప పని అన్నట్లు భావించి దాని అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. 2022 అక్టోబరు 17న ఆళ్లగడ్డకు వచ్చిన జగన్ హామీలిచ్చి అమలు చేయకపోవడంతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులుపడుతున్నారు. డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.2 కోట్లు ఇస్తానని చెప్పి తర్వాత పట్టించుకోకపోవడంతో అవస్థల మధ్య జీవనాన్ని కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ కష్టాలు గట్టెక్కించాలని విద్యార్థులు కోరుతున్నారు.

కళాశాల ఏర్పాటుతో సరిపోతుందా..?

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి రెండేళ్లవుతోంది. ఇంత వరకు సైన్సు ప్రయోగశాలల్ని ఏర్పాటు చేయలేదు. బీకాం(సీఏ), బీఎస్సీ(బాటనీ హానర్సు), బీఏ(ఎకనామిక్స్) గ్రూపుల్లో 95 మంది చదువుతున్నారు. ప్రాక్టికల్స్‌కు అవసరమైన ప్రయోగశాల లేకపోవడంతో బీఎస్సీ విద్యార్థులు నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లాల్సి ఉంటుంది. రాకపోకలకు అయ్యే ఖర్చును సైతం విద్యార్థులే భరించాల్సిన పరిస్థితి నెలకొంది. భవనం లేకపోవడంతో రేకుల షెడ్‌లోనే అయిదు తరగతుల్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నుంచి వసూలయ్యే ఫీజుల్లోంచి కొంత మొత్తం విశ్వవిద్యాలయానికి చెల్లించి మిగిలిన డబ్బుతో కళాశాల నిర్వహణకు అవసరమైన జిరాక్స్ కాగితాలు, చాక్‌పీస్‌లు, డస్టర్లు కొనుగోలు చేస్తున్నారు. అసౌకర్యాల కొరత కారణంగా విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల కళాశాలను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తనిఖీ చేసి అక్కడున్న అసౌకర్యాల పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. కళాశాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యేపైనే విద్యార్థులు, అధ్యాపకులు ఆశలు పెట్టుకున్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి ఇది మూడో ఏడాది అని, అయినా ఇంత వరకు అభివృద్ధికి గత ప్రభుత్వం నుంచి కనీసం ఒక్క రూపాయి కూడా రాలేదని, రూ.2 కోట్లు ఇస్తామన్న హామీ నెరవేరలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రేకులషెడ్‌లోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలి –వి.గోవర్ధన్



డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇప్పటికీ రేకుల షెడ్డులోనే మా తరగతులు జరుగుతున్నాయి. కనీసం బోధనకు తగిన సౌకర్యాలు లేవు. డిగ్రీ కళాశాలలో ఇబ్బందులు తొలగించాలి. కళాశాల ఏర్పాటై మూడేళ్లవుతున్నా గత ప్రభుత్వం ఒక్క రూపాయి కేటాయించలేదు.

కళాశాల ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు –అజయ్



డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి ఇతర విషయాలను గత ప్రభుత్వం గాలికొదిలేసింది. ప్రత్యేక తరగతి గదుల నిర్మాణం చేపట్టాలి. కళాశాల నిర్వహణకు సైతం నిధులు లేక మేము కట్టే ఫీజులపై ఆధారపడుతున్నారు. సైన్సు విద్యార్థులకు ల్యాబ్ లేకపోవడం పెద్దలోటు. లోపాలను సరిదిద్దాలి.